## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట సబ్‌స్టేషన్ పరిధిలోని సుల్తానాఅల్వా 33/11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కటకోనికుంట, చంపాపేట పాత బస్తీ, సాయిరామ్‌నగర్, సుల్తానాఅల్వా, బస్తీ దవాఖానా పరిసర కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## నేటి నుంచి సీపీఎం మహాసభలు



దిల్‌సుఖ్‌నగర్: సంగారెడ్డిలో ఈనెల 25 నుంచి 28 వరకు సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను నిర్వహించనున్నట్లు సరూర్‌నగర్ సర్కిల్ పార్టీ కార్యదర్శి సీహెచ్ వెంకన్న, శాఖ కార్యదర్శి ఎం.గోపీనాయక్ అన్నారు. ఎన్టీఆర్‌నగర్ శుక్రవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను నమ్మి ప్రజలు గెలిపిస్తే ఇప్పటికీ హామీలు అమలుకావడం లేదన్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యవర్గ సభ్యులు కట్ట శ్రీనివాస్, శాఖ సభ్యులు మారోజు పద్మ, రాంచందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 26 నుంచి క్రికెట్ పోటీలు

దిల్‌సుఖ్‌నగర్: గ్రీస్ గైడ్, కొత్తపేటలోని ఓజోన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26 నుంచి క్రికెట్ టీ–20 పోటీలు నిర్వహించనున్నట్లు ఓజోన్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఇంద్రసేనా రెడ్డి తెలిపారు. దవాఖానలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి, ఆందోళనను దూరం చేసేందుకే పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 26 వరకు టీం ఎంట్రీలను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లోని క్రీడా మైదానాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఓజోన్ హాస్పిటల్ డైరెక్టరు, గ్రీస్ గైడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ అన్నారు. సైదాబాద్ రోస్ ల్యాండ్ కాలనీలోని క్యూబా మసీదు సమీపంలోని రోడ్డు పునర్నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సైదాబాద్‌లో పలుచోట్ల తాగునీరు, డ్రైనేజీల పనులు కొనసాగుతున్నాయని, ఆయా పనులు పూర్తయిన తర్వాత అక్కడ కూడా రహదారులను ఆధునీకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, అరుణ, ముజీం పాల్గొన్నారు.


## అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి



హయత్‌నగర్ సర్కిల్ డీసీకి వినతి పత్రం అందజేస్తున్న ఫైమీద తదితరులు

నాగోలు: ఎల్బీనగర్ పరిధిలో అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఫైమీద కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ కమిషనర్ తిప్పర్తి యాదయ్యను శుక్రవారం కలిసి మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం పెన్షన్ ఇవ్వకుండా ఆపివేయడంతో అర్హులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాలనీల్లో పర్యటన



హస్తినాపురం: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. వివిధ కాలనీల్లో శుక్రవారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్టీల్‌బ్రిడ్జి పనులకు అడ్డంకులు తొలగినట్లేనా?

• అలైన్‌మెంట్‌పై పట్టువీడుతున్న ఆందోళనకారులు • అందరికీ లబ్ధి ఫార్ములాతో వీడిన బెట్టు! • త్వరలోనే పనులు ప్రారంభమయ్యే ఛాన్స్



సైదాబాద్‌లో నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జి



వివాదానికి కారణమైన ప్రాంతం

సైదాబాద్: సైదాబాద్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి పనులకు అడ్డంకులు తొలిగినట్లే కనిపిస్తోంది. 11 నెలలుగా ఆందోళనలతో పనులను అడ్డుకుంటున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, పలు హిందూ సంఘాల నాయకులు పట్టు వీడుతున్నట్లు తెలుస్తోంది. రంగంలోకి దిగిన ఓ ప్రజాప్రతినిధి అందరికీ లబ్ధి ఫార్ములాతో చేసిన ప్రయత్నం ఫలించే సూచనలు కనిపిస్తున్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగితే త్వరలోనే సైదాబాద్ స్టీల్‌బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యే ఛాన్స్ ఉంది.

**పనులు ప్రారంభించి నాలుగేళ్లు..**

◆ 2020లో అప్పటి రాష్ట్ర మంత్రి కేటీఆర్ స్టీల్‌బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అయితే నాలుగేళ్లయినా పనులు అరకొరగానే ఉన్నాయి. దాంతో ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లతో ఇబ్బందులు పడుతున్నారు.

**పెరిగిన నిర్మాణ అంచనా వ్యయం..**

◆ స్ట్రాటజికల్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎస్ఆర్‌డీపీ) కింద రూ. 523.37 కోట్లతో చంచల్‌గూడ ప్రభుత్వ ప్రెస్ కార్యాలయం నుంచి సంతోష్‌నగర్ యాదగిరి థియేటర్ వరకు నాలుగు లేన్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో నిర్మాణానికి రూ. 370 కోట్లు, ఆస్తుల సేకరణకు రూ. 153.37 కోట్లను కేటాయించారు. అయితే పనులు ఆలస్యం కావడం, ఇటీవల స్టీల్ ధరలు విపరీతంగా పెరగడంతో అంచనా వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 8న రూ. 620 కోట్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బ్రిడ్జ్ అందుబాటులోకి వస్తే శంషాబాద్ విమానాశ్రయం, శ్రీశైలం, కేంద్ర రక్షణ రంగ కార్యాలయాలకు వెళ్లే వారికి ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

**అలైన్‌మెంట్ మార్పుతో వివాదం మొదలు..**

◆ స్టీల్‌బ్రిడ్జి నిర్మాణానికి ముందుగా ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌లో అధికారులు కొంత మార్పు చేశారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయంపై నుంచి వెళ్లాల్సి ఉంటుంది. అదే ఇక్కడ వివాదానికి దారి తీసింది. కొందరికీ అనుకూలంగా ఉండేందుకే మొదటి అలైన్‌మెంట్ మార్చారని ఆరోపిస్తూ అలాగే ఆలయం పైనుంచి నిర్మాణం వెళ్లడం సరికాదని ఆలయ కమిటీ సభ్యులు, హిందూ సంఘాలు ఆందోళనలకు దిగాయి. దాంతో వంతెన పనులు నిలిచిపోయాయి.

**ప్రజాప్రతినిధి జోక్యంతో సద్దుమణుగుతున్న వివాదం..!**

◆ 11 నెలలుగా పనులు నిలిచిపోవడంతో అధికారులు, ఆందోళనకారుల మధ్య సయోధ్యకు పాతబస్తీకి చెందిన ప్రజాప్రతినిధి జోక్యం చేసుకున్నట్లు సమాచారం. ఆలయానికి వెనుక వైపు ఉన్న 200 గజాల స్థలం ఆలయానికి ఇచ్చేలా ఒప్పందం కుదిరిందని తెలుస్తోంది. ఆలయానికి అదనపు స్థలం ఇచ్చే ప్రతిపాదనకు ఆందోళన చేస్తున్న నాయకులు కూడా అంగీకరించడంతో వివాదం సద్దుమణుగుతుందని భావిస్తున్నారు. ఇదే జరిగితే బ్రిడ్జి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

**అలైన్‌మెంట్ మార్చకుండానే సమసిన వివాదం..!**

◆ అధికారులు ముందుగా ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను మార్చడం వల్లే సైదాబాద్ స్టీల్ బ్రిడ్జ్ పనులు నిలిచిపోవడానికి కారణమయ్యాయి. గుడిపై నుంచి నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమని నాయకులు ఆందోళన సమయంలో తెగేసి చెప్పారు. అయితే ఎలాగోలా వారిని ఒప్పించారని తెలిసింది. చంచల్‌గూడ ప్రెస్ కార్యాలయం నుంచి వివాదానికి కారణమైన ఆలయం వరకు ఇప్పటికే పిల్లర్లు నిర్మించడంతో అలైన్‌మెంట్ మార్చడం కుదరదని, అందుకే టెంపుల్‌కు అదనపు స్థలం ప్రతిపాదన తెచ్చారని సమాచారం. అలైన్‌మెంట్ మార్చకపోయినా నాయకులు నిర్మాణానికి ఒప్పుకోవడంతో వివాదం ఇక పూర్తిగా సమిసిపోయిందని స్థానికులు భావిస్తున్నారు. ఇకనైనా వంతెన పనులు వేగంగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## నేత్రాల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఆర్టీవో కిష్టయ్య

మలక్‌పేట: నేత్రాల సంరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఈస్ట్‌జోన్ ఆర్టీవో లెక్కల కిష్టయ్య అన్నారు. 'జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో' భాగంగా మలక్‌పేట మూసారంబాగ్ ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కంటి, దంత ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులకు, డ్రైవర్లకు వైద్యులు పలు పరీక్షలు చేసి సలహాలు, సూచనలు అందజేశారు. సాయి నేత్రాలయ, సిన్నేఫో డెంటల్ అసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో ఎంవీఐలు బలరాం, రాధిక, నరేంద్రపాల్ సింగ్, రమేశ్‌బాబు, జి. రవీందర్, ఏఎంవీఐలు రజిని, అష్రఫ్‌ఖాన్, మధుసూదన్‌రెడ్డి, జాన్, ఏవోలు ప్రవీణ్‌కుమార్, మధుకర్, అంజుమ్, సిబ్బంది గౌస్, వినయ్, విజయలక్ష్మి, మహేశ్వరి, శ్రీకాంత్, విజయ, అరుణ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా భవనం పనుల పరిశీలన



కార్పొరేటర్ లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

ఎల్బీనగర్: శాతవాహననగర్ కాలనీలో నిర్మిస్తున్న మహిళా భవనాన్ని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి కాలనీవాసులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ భవన్‌లో మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను కాలనీవాసులు సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌రావు, చిరంజీవి, తిరుమల్‌రావు, రామకిషన్‌రావు, పద్మావతి, శారద, లక్ష్మి, మాణిక్యాంబ, సువర్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సినీ దర్శకుడు పీసీ ఆదిత్యకు ప్రతిష్టాత్మక అవార్డు

నాగోలు: సినీ రంగంలో నిత్య ప్రయోగశీలి దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్యకు మరో ప్రతిష్టాత్మక పురస్కారం వరించింది. భారతీయ చలన చిత్ర పితామహుడు దాదా సాహెబ్ ఫాల్కే జ్ఞాపకార్థం అందించే సినీ పురస్కారాల్లో భాగంగా ఇటీవల ముంబైలో జరిగిన కార్యక్రమంలో దక్షిణ భారత సినీ రంగం నుంచి ఆయన ఎంపికయ్యారు. ఈ అవార్డు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేది కాదని, ముంబైకి చెందిన ప్రముఖ సంస్కృతి సంస్థ అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలియజేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తదితరులు

## డ్రగ్స్ వాడకంతో జీవితం నాశనం

మలక్‌పేట: డ్రగ్స్ అలవాటుతో జీవితాలు బుగ్గిపాలు అవుతాయని టీజీఏఎన్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320డీ ఆధ్వర్యంలో మలక్‌పేట సెయింట్ జేవీయర్స్ హైస్కూల్లో విద్యార్థులకు డ్రగ్స్‌నో, సైబర్‌క్రైమ్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకంతో అనారోగ్య సమస్యలు, కుటుంబం, బంధువులు, సమాజానికి దూరమై ఒంటరి జీవితం గడపాల్సిన దుస్థితి ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు. అలాగే సైబర్ క్రైమ్‌లతో ఎలా నష్టం వాటిల్లుతుందో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను వివరిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్ మహమ్మారిని పారదోలుదామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ లయన్ జి. హిజ్కియా, యాంటీ డ్రగ్స్–320డీ చైర్మన్ కొట్టం జంగయ్యయాదవ్, హెల్త్ క్యాంపు చైర్మన్ డాక్టర్ విజయరంగా, క్లబ్ ప్రెసిడెంట్ కర్ణ శ్రీనివాస్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థినిపై బ్లేడ్‌తో దాడి కేసు నమోదు

చైతన్యపురి: కాలేజీకి వెళుతున్న ఇంటర్ విద్యార్థినిపై గుర్తుతెలియని వ్యక్తులు బ్లేడ్‌తో దాడి చేసిన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన కండె కృష్ణాజోష్, మంజు జోష్ దంపతులు నగరానికి వలస వచ్చి వాసవీ కాలనీలోని టీఎస్ఆర్ విహారి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె (16) స్థానిక ఎస్ఆర్ గాయత్రీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం ఆమె కాలేజీకి వెళుతుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె చేతులు గట్టిగా పట్టుకుని రెండు చేతులపై బ్లేడ్‌తో గాయపరిచారు. దీంతో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

## యజ్ఞాల నిర్వహణ అభినందనీయం

లింగోజిగూడ: శ్రీ సర్వ సౌభాగ్య దేవి త్రయ గీత జ్ఞాన యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్య కార్యక్రమమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాల్లో మురుకుంట్ల రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1935వ జ్ఞాన యజ్ఞ కార్యక్రమాన్ని శ్రీ ఓంకార ప్రణవ పతకవిష్కరణ శ్రీ మహాగణాధిపతి పూజ కార్యక్రమాలతో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి ఎనిమిదేళ్లుగా యజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు ఉఆరే లక్ష్మణ్ గుప్తా, శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ యజమాన్యం సూరిశెట్టి సింహయ్య, సూరిశెట్టి శ్రీనివాస్ గుప్తా, సూరిశెట్టి సురేశ్ గుప్తా, సూరిశెట్టి శశిధర్ గుప్తా, జూలూరు శ్రీనివాస్ గుప్తా భక్తులు పాల్గొన్నారు.


## నేడు పొన్నం ప్రభాకర్ పర్యటన

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలోని ఆర్‌కేపురంలో రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి శనివారం పర్యటించనున్నట్లు ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేశ్‌నేత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ. 41 లక్షల విలువైన ఎస్‌డీఎఫ్ నిధులతో శ్రీ రామకృష్ణాపురం కాలనీ, హరిపురి కాలనీల్లో సీనియర్ సిటిజన్ బిల్డింగ్‌ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు.ఉదయం 9గంటలకు శ్రీ రామకృష్ణాపురం కాలనీ రోడ్ నంబర్ 2లో, హరిపురికాలనీలో పార్క్ వద్ద శంకుస్థాపనతో పాటు, మీర్‌పేట్, అల్మాస్‌గూడ, మహేశ్వరం, కందుకూర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ఉంటాయిని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### సమస్యలు పరిష్కరించాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ డివిజన్ కార్పొరేటర్ రాధా కోరారు. ఈమేరకు ఆర్‌కేపురం కాలనీవాసులతో కలిసి జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ సుజాతను శుక్రవారం కలిసి విన్నవించారు. రోడ్లు, పార్కులు, జిమ్‌లు ఏర్పాటు చేయాలని ఆమెను కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా బాల్‌రాజ్



హయత్‌నగర్: హయత్‌నగర్ ముదిరాజ్ సహకార సంఘం అధ్యక్షుడిగా ఆకిటి బాల్‌రాజ్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల్లో పెద్ద సంఖ్యలో ఉన్న ముదిరాజ్ కులస్తులు అన్ని రకాలుగా వెనుకబడి ఉన్నారని, వారిని రాజకీయంగా, ఆర్థికంగా చైతన్యం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే హయత్‌నగర్ ముదిరాజ్ సంఘంలోని సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు నింగం దశరథ, గుడాల ఎల్లయ్య, పిడుగు సత్యనారాయణ, ముదిరాజ్ కాలనీ అధ్యక్షులు లింగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం శిబిరంలో అసోసియేషన్ నేతలు

మన్సూరాబాద్: ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ సహారా స్టేట్స్ కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా.పెండెం కృష్ణకుమార్ హాజరై మాట్లాడారు. 103 మంది రక్తదానం చేయగా వారికి సర్టిఫికేట్లతో పాటు పర్యావరణ రక్షణకు క్లాత్‌బ్యాగులు అందించామన్నారు. దేశవ్యాప్తంగా 760 జిల్లాల్లో నిర్వహించిన శిబిరాల్లో శుక్రవారం ఒక్కరోజే 75 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి అందించామని, గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో నమోదు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి మహేందర్‌రెడ్డి, సభ్యులు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వేణు. సాయినాథ్, వెంకటేశ్, గోపి, ప్రవీణ్, భిక్షపతి, గణేశ్, చంద్రశేఖర్, కాలనీ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ జానీ తదితరులు పాల్గొన్నారు.

## పాత విద్యుత్ స్తంభాలను తొలగించాలి



విద్యుత్ పోల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని సుల్తానాఅల్వా, హరిజనబస్తీలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ఆయా కాలనీవాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కాలనీలో పర్యటించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పోల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, నాయకులు యోగిరాజ్, దొబ్బ శ్రీను, రాజు, కేశవులు, అశోక్, బైగళ్ల బాలమణి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలి



వనస్థలిపురం: నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ ఏఈ హేము నాయక్‌తో కలిసి డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



శ్రీవల్లి

నాగోలు: ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నాగోలు ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కొండమల్లెపల్లికి చెందిన గౌరు రోజు జయప్రద కుమార్తె శ్రీవల్లి (18) ఇంటర్‌లో ఫెయిలైన సబ్జెక్టుల కోసం కొన్ని రోజుల క్రితం నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడలోని లక్ష్మి బాలికల హాస్టల్ లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నది. సంక్రాంతి సెలవులకు ఈనెల 11న ఇంటికి వెళ్లి ఈనెల 17న హాస్టల్‌కు వచ్చింది. 23న కూతురు కోసం హాస్టల్ వారికి ఫోన్ చేసి శ్రీవల్లి 20న ఇంటికి పంపినట్లు సమాచారం తెలిపారు. అయితే తమ కుమార్తె ఇంటికి రాలేదని వారు బదులిచ్చారు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బండ్లగూడ హాస్టల్‌కు చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించగా తమ గ్రామానికి చెందిన వ్యక్తి ద్వారా పంపినట్లు తెలిపారు. బాధితురాలు తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

చైతన్యపురి: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. 'జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల' సందర్భంగా దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సమత ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన 'డ్రైవర్స్ డే' లో ఆయన పాల్గొని మాట్లాడారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దన్నారు. అలాగే 35 ఏళ్లుగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు సూర్యకుమార్, ఇబ్రహీం ఖాన్, అరుణ్‌కుమార్, రాములును సన్మానించారు. అనంతరం రోడ్డు భద్రతపై ర్యాలీ తీసి డిపో మేనేజర్ సమత డ్రైవర్లకు గులాబీ పూలు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు రాము, వినోద్‌కుమార్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

**డ్రైవర్లదే కీలక పాత్ర**

హయత్‌నగర్: రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని టీజీఎస్ ఆర్టీసీ హయత్‌నగర్–1,2 బస్‌డిపోల మేనేజర్లు విజయ్, శ్రీనివాస్ అన్నారు. 'డ్రైవర్స్‌డే' సందర్భంగా సిబ్బందితో కలిసి డిపోల నుంచి హయత్‌నగర్ బస్టాప్ వరకు శుక్రవారం ర్యాలీ తీసి రోడ్డు వెంట డ్రైవర్లకు పుష్పగుచ్ఛాలు, స్వీట్లు ఇచ్చారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్లు విజయకుమారి, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, సయ్యద్ పాల్గొన్నారు.

**నాగార్జున మాంటిసోరి ఐఐటీ స్కూల్‌లో..**

నాగోలు: డివిజన్‌లోని సాయినగర్ నాగార్జున మాంటిసోరి ఐఐటీ స్కూల్‌లో 'రోడ్డు భద్రత –రోడ్డు ప్రమాదాల' నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నాగోలు ఇన్‌చార్జి ఆర్టీఓ అమర్నాథ్, రవాణా శాఖ అధికారులు శ్రీధర్ అభిలాష్, వేణు, ప్రసాద్ విద్యార్థులకు పలు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాఠశాల బస్సుల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు భద్రతపై వ్యాసరచన పోటీలు**

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపోలో శుక్రవారం రోడ్డు భద్రతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.అలాగే ప్రమాదాలు జరగకుండా విధులు నిర్వహించిన డ్రైవర్లు జి.ఖాన్, పి.రాము, కె.లక్ష్మణ్‌ను మలక్‌పేట ట్రాఫిక్ ఎస్ఐ రాములు, డిపో మేనేజర్ కృష్ణమూర్తి సన్మానించారు. కార్యక్రమంలో ఎంటీ ఉషశ్రీ, ఏఈ సతీశ్, ఉమాపతి, రమాదేవి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంలు విజయ్, శ్రీనివాస్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365